## బియ్యం అందజేత

విద్యార్థులను అభినందిస్తున్న ఏంఈవో రాధాకృష్ణమూర్తి

భీమారం, మార్చి 31 : ఖాజీపల్లి గ్రామానికి చెందిన దుర్గం దుర్గ కూతురు కృష్ణవేణి వివాహం ఉండగా, నిరుపేదలు కావడంతో ఆర్కే ఫౌండేషన్ సభ్యులు క్వింటాల్ బియ్యం ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండ చందు, డొంగరి రాజలింగు, భూక్యా రాజేశ్ నాయక్, సోదరి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 108 వాహనంలో ప్రసవం

ఆడశిశువుతో 108 సిబ్బంది

జన్నారం, మార్చి 31 : 108 వాహనంలోనే ఓ మహిళ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ సంఘటన జన్నారం మండలంలో చోటుచేసుకున్నది. తెలిసిన వివరాల ప్రకారం.. కవ్వాల్ గ్రామానికి చెందిన శ్యామలకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న 108 పైలెట్లు కిషన్, రఫీక్.. హుటాహుటిని దవాఖానకు తరలిస్తున్నారు. మార్గమధ్యంలోనే శబ్యూమల ప్రసవించింది. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని పైలట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్యామల కుటుంబ సభ్యులు అంబులెన్స్ పైలెట్లకు కృతజ్ఞతలు తెలిపారు.

## శాంతి భద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్

కొండపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ అల్లం రాంబాబు

పెంచికల్ పేట్, మార్చి 31: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని కాగజ్‌నగర్ రూరల్ సీఐ అల్లం రాంబాబు అన్నారు. ఆదివారం మండలంలోని కొండపల్లి గ్రామంలో ఎస్సీ సురేశ్ కుమార్ ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని అన్నారు. గ్రామాల్లో గుడుంబా, పేకాట, కోడిపందాలు నిర్వహించవద్దని సూచించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. సరైన పత్రాలు లేకుండా 50 వేలకు మించి డబ్బులతో పట్టుపడితే స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు, రాజు, కొమురయ్య, బెజ్జూర్, దహెగాం, పెంచికల్‌పేట్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న సమతా సైనిక్ దళ్ కేంద్ర సభ్యుడు రవిచంద్ర జాబాడె

జైనూర్, మార్చి 31 : సమతా సైనిక్‌దళ్ శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేయాలని సమతా సైనిక్‌దల్ కేంద్ర రాష్ట్ర సభ్యుడు మార్షల్ రవిచంద్ర జాబాడె అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 20 నుంచి 29వ తేదీ వరకు కెరమెరి మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన విగ్రహావిష్కరణ సందర్భంగా ఈ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కెరమెరి, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్, గాదిగూడ మండలాల నుంచి పెద్దఎత్తున యువత ఈ శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. గౌతమ బుద్ధుని శాంతి మార్గంతో మంచి అలవాట్లు అలవర్చుకొని జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కోఆర్డినేషన్ శిలానంద్ కాంబ్లే, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పాపేస్ బాన్‌సాడే, రాష్ట్ర ట్రైనింగ్ ఆఫీసర్ విక్రమ్ కాంబ్లే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అసోసియేషన్ యూత్ నాయకుడు సిద్ధార్థ సోనికాంబ్లే, సత్యవాణి కాంబ్లే, ఘటనాకర్ వాగ్మారె, అభయ్ కాంబ్లే, అశోక్ కాంబ్లే తదితరులు పాల్గొన్నారు.

## నిర్భయంగా ఓటేయాలి

జైనూర్, మార్చ్ 31 : లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆసిఫాబాద్ డీఎస్పీ సాదయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సీఆర్పీఎఫ్ పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించారు. అనంతరం కుమ్రం భీం చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద రాజకీయ నాయకులు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు పెడతామని తెలిపారు. ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. మసీదు, దేవాలయం, చర్చిల్లో రాజకీయ పార్టీ నాయకులు సమావేశాలు నిర్వహించవద్దని డీఎస్పీ అన్నారు. ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ అంజయ్య, సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బద్రిప్రసాద్, జైనూర్ లింగాపూర్ ఎస్ఐలు సందీప్ కుమార్, ప్రవీణ్ కుమార్, సీఆర్పీఎఫ్ బలగాలు, పోలీసులు పాల్గొన్నారు.

జైనూర్‌లో కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ సాదయ్య

శిథిలావస్థలో ఉన్న మందమర్రి సబ్ పోస్టాఫీస్ భవనం

వెనుక భాగంలో కూలిన పోస్టాఫీస్ గోడ

# శిథిలావస్థలో పోస్టాఫీస్ భవనం

- ప్రమాదపుటంచున కళ్యాణిఖని బ్రాంచ్
- ఆరు దశాబ్దాలుగా సింగరేణి క్వార్టర్‌లోనే సేవలు
- లక్షల్లో పేరుకుపోయిన అద్దె బకాయిలు
- చెల్లిస్తేనే మరమ్మతులు చేస్తామని నోటీసులు ఇచ్చిన కోల్‌బెల్ట్ అధికారులు
- పట్టించుకోని తపాలాశాఖ అధికారులు
- భయం గుప్పిట్లో సిబ్బంది విధులు

మందమర్రి, మార్చి 31 : సింగరేణి పారిశ్రామిక ప్రాంతమైన మందమర్రి పట్టణంలోని కళ్యాణిఖని సబ్ పోస్టాఫీస్ భవనం.. శిథిలావస్థకు చేరుకున్నది. ఆరు దశాబ్దాలుగా సింగరేణి క్వార్టర్‌లోనే సేవలు అందిస్తుండగా, అద్దె బకాయిలు పేరుకుపోవడంతో నిర్వహణ కరువైంది. చుట్టూ ప్రహరీ, పై కప్పు పెచ్చులూడిపోవడంతో పాటు వెనుక భాగం గోడ కొంత భాగం కూలిపోయింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది భయం గుప్పిట్లో విధులు నిర్వహిస్తుండగా, ఎవరూ పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శ వెల్లువెత్తుతున్నది.

ఆరు దశాబ్దాల క్రితం కేంద్ర తపాలాశాఖ.. సింగరేణి పారిశ్రామిక ప్రాంతమైన మందమర్రి పట్టణంలో పోస్టాఫీస్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం అద్దె ప్రాతిపదికన రెండు సీ టైపు క్వార్టర్లను కేటాయించింది. దీంతో మార్కెట్ సమీపంలోని క్వార్టర్‌లో సబ్ పోస్టాఫీస్‌ను ఏర్పాటు చేశారు. ఉత్తరాల బట్వాడాతో పాటు చిన్న మొత్తాల పొదుపు పథకాలు, తపాలా జీవిత బీమా, ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సేవలు, ఆధార్ సేవలందిస్తున్నారు. అయితే కొన్నేండ్ల నుంచి సింగరేణి యాజమాన్యానికి క్వార్టర్లకు సంబంధించిన అద్దె చెల్లించకపోవడంతో రూ.12 లక్షల బకాయి పేరుకుపోయింది. దీంతో సింగరేణి అధికారులు పోస్టాఫీస్‌కు కేటాయించిన క్వార్టర్ల నిర్వహణను పట్టించుకోవడం లేదు. అప్పటి నుంచి ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నది. క్వార్టర్ల చుట్టూ గోడలు, పై కప్పు పెచ్చులూడిపోవడంతో పాటు వెనుక భాగం గోడ కొంత మేర కూలిపోయింది. ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయంతో అధికారులు, సిబ్బందితో పాటు వివిధ అవసరాలపై వస్తున్న వినియోదారులు ఆందోళన చెందుతున్నారు. సిబ్బంది ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని తప్పనిసరి పరిస్థితిలో విధులు నిర్వహిస్తున్నారు. కేంద్రం ఆధీనంలో కొనసాగుతున్న పోస్టాఫీస్ అద్దె చెల్లింపు విషయాన్ని ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పోస్టాఫీస్‌ను ఏర్పాటు చేసి దశాబ్దాలు గడచినా సొంత భవన నిర్మాణం విషయాన్ని గాలికొదిలేశారని ప్రజలు, వినియోగదారులు మాట్లాడుకుంటున్నారు.

ఈ విషయంపై పోస్ట్ మాస్టర్ సుధాకర్ గౌడ్‌ను ప్రశ్నించగా, దశాబ్దాల క్రితం కేటాయించిన భవనాన్ని ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. సింగరేణి యాజమాన్యానికి మరమ్మతులు చేయాలని కోరుతూ దరఖాస్తును సమర్పించామని వివరించారు. పోస్టాఫీస్‌కు సంబంధించి రూ.12 లక్షల అద్దె బకాయి చెల్లించాల్సి ఉన్నదని, నోటీసు జారీ చేసిన సింగరేణి అధికారులు, బకాయిలు చెల్లిస్తేనే మరమ్మతులు చేయిస్తామంటున్నారని పేర్కొన్నారు. తపాలాశాఖ ఉన్నతాధికారులకు అద్దె బకాయిల విషయంపై ప్రతిపాదనలు పంపిచామని తెలిపారు. పూర్తి వివరాలతో ప్రతిపాదనలు పంపించాలంటునానరని వెల్లడించారు. ఏదేమైనా సింగరేణి యాజమాన్యం గానీ, తపాలాశాఖ ఉన్నతాధికారులు గానీ భవనం మరమ్మతులకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

## నేడు బార్ అసోసియేషన్ ప్రమాణస్వీకారం

మంచిర్యాల ఏసీసీ, మార్చి 31 : జిల్లా కేంద్రంలోని స్వాగత్‌ప్లైడ్ హోటల్లో సోమవారం మంచిర్యాల బార్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషనర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత బుధవారం ఎన్నికల కమిషనర్ ఎన్ కమలాలమనోహర్ రావు, సహాయ ఎన్నికల కమిషనర్ జీ మహేందర్ పర్యవేక్షణలో అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించిట్లు పేర్కొన్నారు. నూతన అధ్యక్షుడిగా బండవరం జగన్ ఎన్నికవగా, ఉపాధ్యక్షుడిగా కే గంగయ్య, ప్రధాన కార్యదర్శిగా కే మురళీకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా ఎం కనుకయ్య, కోశాధికారిగా అల్లెం శ్రీనివాస్, లైబ్రరీ కార్యదర్శిగా సాగె గురువయ్య, స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యదర్శిగా ఎన్ సంతోష్ గౌడ్, అసోసియేషన్ మహిళా ప్రతినిధిగా ఎన్ రాధిక, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సోమ ప్రదీప్ చంద్ర, పెసర శ్రీకాంత్, సుంకు లక్ష్మీనారాయణ, దుర్గం రమేశ్, ఉమారాణీ ఎన్నికయ్యారు.

## అసాంఘిక కార్యకాలపాలకు దూరంగా ఉండాలి

ధర్మారం గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ మోహన్

భీమారం, మార్చి 31 : అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని శ్రీరాంపూర్ సీఐ మోహన్, ఎస్ఐ రాములు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఉదయం 4 గంటల ప్రాంతంలో ఆవుడం క్రాస్ రోడ్డు సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని పరిశీలించారు. అనంతరం ధర్మారం గ్రామంలో ప్రజలతో మాట్లాడారు. యువత చెడుఆలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనితెలిపారు.

# ఘనంగా ఈస్టర్ వేడుకలు

- జిల్లా వ్యాప్తంగా చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు
- యేసు సందేశం వినిపించిన పాస్టర్లు

మంచిర్యాల ఏసీసీ, మార్చి 31 : జిల్లా కేంద్రంలోని అన్ని చర్చీల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు సందేశాన్ని భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ కమిటీ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

**లక్షెట్టిపేటలో..**

లక్షెట్టిపేట, మార్చి 31 : పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. శిలువ గుట్ట వద్ద వేకువ జామున 4 గంటలకు కుటుంబ సభ్యులతో చేరకున్న క్రైస్తవు ప్రార్థనలు చేశారు. యేసుక్రీస్తు మహిమలు, ఈస్టర్ వేడుకల గురించి భక్తులకు చర్చి ఫాదర్లు వివరించారు. శిలువ గుట్టపై శిలువ వద్ద కొవ్వొత్తులు వెలిగించారు. అలాగే క్రైస్తవులు ఒకరికొకరు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**శ్రీరాంపూర్‌లో..**

శ్రీరాంపూర్, మార్చి 31 : శ్రీరాంపూర్ కృష్ణ కాలనీలోని సీఎస్ఐ వెస్లీ చర్చిలో ఈస్టర్ వేడుకలు క్రైస్తవులు ఘనంగా జరపుకున్నారు. పాస్టర్స్ కే సురేశ్, వినయ్‌ప్రశాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫిలోమన్ రాజు క్రైస్తవ సోరీ, సోదరులు పాల్గొన్నారు.

**మందమర్రిలో..**

మందమర్రి, మార్చి 31 : మందమర్రి పట్టణంలోని క్రైస్తవ కుటుంబాలు ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నాయి. తెల్లవారు జాము నుంచే పట్టణంలోని చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశాయి. స్థానిక పాత బస్టాండ్ ఏరియాలోని బేతెస్థ మినిస్ట్రీస్ పాస్టర్ జయపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. చర్చి వద్ద ప్రారంభమైన ర్యాలీలో క్రైస్తవులు పాటలు పాడుతూ ఆనందోత్సాహాల నడుమ మారుతీనగర్, పాత బస్టాండ్ ఏరియా మీదుగా వెళ్లారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

**దండేపల్లిలో..**

దండేపల్లి, మార్చి 31 : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి 8 గంటల వరకు భక్తులు ఆరాధనలో పాల్గొన్నారు. పాస్టర్లు యేసు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా చర్చీలను విద్యుద్ దీపాలతో అలంకరించారు.



లక్షెట్టిపేట : శిలువ గుట్ట వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

దండేపల్లి : ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

మంచిర్యాల ఏసీసీ : ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

మందమర్రి : క్రైస్తవ కుటుంబాల ర్యాలీ

శ్రీరాంపూర్ : ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

## చివరి రోజు చెన్నూర్‌లో పన్నుల వసూళ్లు

చెన్నూర్, మార్చి 31 : 2023-24 ఆర్థిక సంవత్సరంలో చివరి రోజైన ఆదివారం చెన్నూర్ మున్సిపాలిటీలో అధికారులు ఆస్తి పన్నులను వసూలు చేశారు. వంద శాతం లక్ష్యాన్ని చేరుకునేందుకు ఒక్కరోజే మిగిలి ఉండడంతో మున్సిపల్ కమిషనర్ గంగాధర్‌తో పాటు అధికారులు బృందాలుగా పలు వార్డుల్లో తిరుగుతూ పన్నుల వసూళ్ల బాట పట్టారు. పన్నులు చెల్లిస్తే 90 శాతం వడ్డీ మాఫీ అవుతుందని వివరించారు.

ఆస్తి పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగాధర్

## వార్షికోత్సవ హంగామా

వేషధారణలో నృత్యం చేస్తున్న చిన్నారులు

లక్షెట్టిపేట, మార్చి 31 : పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ 46వ వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పాఠశాల విభాగ్ అధ్యక్షుడు డాక్టర్ విష్ణువర్ధన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేశారు. పట్టుదల క్రమశిక్షణ ఉంటే అనుకున్నది సాధించగలుగుతారని విద్యార్థులకు సూచించారు. అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, జిల్లా కార్యదర్శి నరేందుల రవీంద్ర కుమార్, ఉపాధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు, కార్యదర్శి చింత అశోక్, సహ కార్యదర్శి పల్లెర్ల మనోహర్, అకాడమిక్ ఇన్‌చార్జి పూదరి సత్యనారాయణ, పాలకుర్తి లచ్చన్న, ప్రభందకారిణి సభ్యులు ప్రధానాచార్యులు పెంటయ్య, ఆచార్యులు, పూర్వ ఆచార్యులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత పోషకులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు ఆర్థిక చేయూత

మందమర్రి, మార్చి 31 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు రెండోజోన్‌లో ఇటీవల తల్లిదండ్రులు మృతిచెందడంతో అనాథలుగా మారిన చిన్నారులు హార్థిక్, కార్తీక్‌కు ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆర్థిక చేయూతనందించారు. చిన్నారులు తల్లిదండ్రులను కోల్పోయారన్న విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న ట్రస్ట్ సభ్యులు, ఆదివారం చిన్నారుల అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తక్షణంగా రూ.20 వేల సాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు బీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. చిన్నారుల తండ్రి శ్యామ్ గతంలో కూలీ పనులకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందాడని, అలాగే తల్లి భూమక్క అనారోగ్యంతో చనిపోవడం చాలా బాధాకరమైన విషయమన్నారు. చిన్నారులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి టీ సురేశ్, ప్రచార కార్యదర్శి శరత్‌బాబు, సభ్యులు ఎస్ మహేందర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు చెక్కును అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

## విశ్రాంత ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

జన్నారం, మార్చి 31 : మండలంలోని ధర్మారం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రాంరెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. కాగా, మండల కేంద్రంలోని జ్యోతి గార్డెన్‌లో ఆదివారం రాంరెడ్డి దంపతులను ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తిరుమల రెడ్డి ఇన్నారెడ్డి ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి విజయ్‌కుమార్, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు కట రాజమౌళి, గోపాల్, శ్రీనివాస సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాంరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ సభ్యులు

## నవోదయ, సైనిక్ స్కూల్స్‌కు ఎంపిక

విద్యార్థులను అభినందిస్తున్న ఏంఈవో రాధాకృష్ణమూర్తి

చెన్నూర్, మార్చి 31: చెన్నూర్ పట్టణంలోని శార్వాణి ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు జీ దిలీప్, జీ ఆకాశ్ నవోదయ, ఆల్ ఇండియా సైనిక్ పాఠశాల్లో ప్రవేశానికి ఎంపికైనట్టు పాఠశాల కరస్పాండెంట్ మేడ శ్రావణ్‌రెడ్డి తెలిపారు. నవోదయ పాఠశాలకు దిలీప్, ఆల్ ఇండియా సైనిక్ పాఠశాలకు ఆకాశ్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను మండల విద్యాధికారి కే రాధాకృష్ణమూర్తి, కరస్పాండెంట్ శ్రావణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు స్వామి, మహేశ్ తదితరులు అభినందించారు.

## చలివేంద్రం ఏర్పాటు

లక్షెట్టిపేట, మార్చి 31 : పట్టణంలోని గాంధీ చౌక్‌లో శ్రీ సత్యసాయి చలివేంద్రంను సత్యసాయి సభ్యులు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గంప రవీందర్, రమేశ్, నగధర్, రవీందర్, శ్రీనివాస్, మనోహర్, సుధాకర్, మురళి, ప్రణీత్, వసంత, రోజారాణి, లావణ్య, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభిస్తున్న సత్యసాయి సభ్యులు